క్లుప్తంగా

సాగర్ ట్రాన్స్‌కో ఏఈగా కళ్యాణి



నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ(నాగార్జునసాగర్) ట్రాన్స్‌కో ఏఈగా కళ్యాణి మంగళవారం విధుల్లో చేరారు. ఆమెకు సాగర్‌లోని సెక్షన్ ఆఫీసులో టీఆర్‌కెవీఎస్ యూనియన్ హాలియా సబ్‌డివిజన్ ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. సన్మానించిన వారిలో హరికృష్ణ, శ్రీను నాయక్‌లు ఉన్నారు.

మండల అధ్యక్షుడిగా విజయ్ కుమార్ గౌడ్



నిడమనూరు : యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నర్సింగ్ విజయ్‌కుమార్ గౌడ్‌ను నియమించారు. మండలంలోని ఊట్కూర్ సర్పంచ్‌గా ఉన్న విజయ్‌కుమార్‌ను మరోసారి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నియమించి ఉత్తర్వులను మంగళవారం మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జానారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుల నియామకం



సైదులుకు నియామక పత్రం అందజేస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి

హాలియా : యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన గుర్రం అమరేందర్‌రెడ్డి నియమితులయ్యారు. అదే విధంగా అనుముల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా హాలియాకు చెందిన నకిరేకంటి సైదులు మాదిగ ఎన్నికైయ్యారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నియమితులైన వారికి మంగళవారం మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కుందూరు జైవీర్‌రెడ్డితో పాటు సాగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నియోజకవర్గ కార్యదర్శిగా కోలా శ్యామ్

నిడమనూరు : నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా నిడమనూరుకు చెందిన కోలా శ్యామ్‌ను నియమితులయ్యారు. మంగళవారం ఈ మేరకు మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి నియామక పత్రం అందజేశారు. శ్యామ్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తానని తెలిపారు. కాంగ్రెస్ బలోతపే తన లక్ష్యమన్నారు. తన నియామకానికి సహకరించిన జానారెడ్డికి గారికి కృతజ్ఞత తెలిపారు.

బతుకమ్మ చీరల పంపిణీ



బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న సర్పంచ్

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని దంజిలాల్‌తండాలో సర్పంచ్ లలిత భీమ్‌సింగ్ నాయక్ మంగళవారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ కానుకగా మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అనిత, కృష్ణ, నాజి, కిషన్, రవిబావోజి, దశరథ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి డీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

శాలిగౌరారం : మహబూబ్‌నగర్ పట్టణంలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరగనున్న డీటీఎఫ్(డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) 5వ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక రజతోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వెంకటేశం కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యారంగంలో వస్తున్న నూతన ధోరణులు, పరిణామాలు, విద్యారంగ వృత్తి సమస్యలు, సామాజిక అంశాలపై జాతీయస్థాయిలో ప్రావీణ్యం కలిగిన విద్యావేత్తలు ఈ సమావేశంలో విలువైన సందేశం ఇవ్వనున్నారని తెలిపారు. ఆయనవెంట నాగరాజు, సైదులు, యాకూబ్‌అలీ, భూపాల్, నర్సింహాచారి, గోపాల్, యాదగిరి, అంజయ్య, నగేశ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్



నియమావళిపై వివిధ పార్టీల నాయకులకు అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నిడమనూరు : ఎన్నికల సంఘం షెడూల్యే‌ల్ ప్రకటించినందున ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని అదనపు కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఆర్‌ఓ) శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నిడమనూరు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి నియమావళి అమలులోకి వస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో శాంతియుతంగా, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులు, వారి అనుచరులు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిడమనూరు తహసీల్దార్ కృష్ణయ్య, కాంగ్రెస్ నాయకుడు తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, సీపీఎం నాయకులు కొండేటి శ్రీను నాయకుల పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, పోస్టర్ల తొలగింపు

మండల కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, జెండాలను అధికారులు మంగళవారం తొలగించారు. ఎన్నికల షెడ్యూల్ అమలులోకి వచ్చిన సందర్భంగా మండలంలో రాజకీయ నాయకులు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను తొలగించడం ప్రారంభించారు.

పెద్దవూర : రాష్ట్రంలో సోమవారం మధ్యాహ్నం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు అన్ని పార్టీల నాయకుల ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. మంగళవారం పెద్దవూర మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఆయా రాజకీయ పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, గోడలకు రాసిన వాల్ రైటింగ్ వంటి వాటిని అధికారులు తొలగించారు.

అడవిదేవులపల్లి : ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండలం కేంద్రంతో పాటు గ్రామాల్లో ఉన్న వివిధ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు, తోరణాలను మంగళవారం ఆయా గ్రామాల పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు.

మిర్యాలగూడ టౌన్ : ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మున్సిపాలిటీలోని వివిధ పార్టీలకు చెందిన జెండాలు, తోరణాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలను మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ ఆదేశాల మేరకు పారిశుద్ధ్య సిబ్బంది మంగళవారం తొలగించారు. ప్రధానంగా సాగర్ రోడ్డు, నల్లగొండ రోడ్డు, ఖమ్మం రోడ్డులతో పాటు పలు ప్రాంతాల్లో ఉన్నవాటిని తొలగించారు.



అడవిదేవులపల్లి : పోస్టర్లు, జెండాను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

త్రిపురారం : రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మండల కేంద్రంలో వివిధ పార్టీలు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను గ్రామ పంచాయతీ సిబ్బంది మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా త్రిపురారం పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర కుమార్ మాట్లాడతూ.. ప్రజా ప్రతినిధులు ఎన్నికల నిబంధనలను తప్పని సరిగా పాటించాలని కోరారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ మాధవరం సునీత

డిండి : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేస్తేనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ మాధవరం సునిత జనార్ధన్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులు మంజూరు కాకముందే అన్ని పనులకు శిలాఫలకాలు ఏర్పాటు చేయడం ఏమిటని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు దామోదర్‌రావు సభ దృష్టికి తీసుకొచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలైన దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు, గృహలక్ష్మీ వంటివి అర్హులైన నిరుపేదలకు కాకుండా కేవలం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే అందుతున్నాయని ఖానాపూర్ సర్పంచ్ విజయేందర్‌రెడ్డి సభలో పేర్కొన్నారు. మండలానికి 108 అంబులెన్స్ సౌకర్యం కల్పించడంలో టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానిక ఎంపీటీసీ ఏటీ రాధికకృష్ణ ఆరోపించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ మాధవరం దేవేందర్‌రావు, ఇంఛార్జీ ఎంపీడీఓ డానియల్, పీఆర్ఏఈ విజయ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామకార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీల్యానాయక్

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు తనపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని కేతావత్ బీల్యా నాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి చెందిన కొంతమంది కాంగ్రెస్ నాయకుల ఒంటెద్దు పోకడలతో విసుగు చెంది కాంగ్రెస్ పార్టీని వీడి నేడు బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.తాను పార్టీలో చేరిన నాటి నుండి క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేశానని కానీ పార్టీలో తగిన ప్రాధాన్యత లేకపోవడంతో తాను పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. 2014లో టీడీపీ నుండి పోటీ చేసి కేవలం 4వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యానని, 2018లో బీఎస్పీ నుండి ఎమ్మెల్యేగా పోటీ చేయగా 20వేల పైచిలుకు ఓట్లు వచ్చినట్లు ఆయన గుర్తు చేశారు. తనకు నియోజకవర్గంలో ప్రజాదరణ ఉందని తెలిపారు. నేడు 2500 మందితో ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో హరినాయక్, నాగార్జున్, రమేష్‌గౌడ్, శ్రీను, తదితరులున్నారు.

శిలాఫలకం లేకుండానే శంకుస్థాపన



శిలాఫలకం లేకుండా ఏర్పాటు చేసిన బోర్డును చూపిస్తున్న గిరిజన నాయకులు

హాలియా : ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని తెలుసుకోని ఎమ్మెల్యే నోముల భగత్ హడావిడిగా బంజారా భవనానికి శిలాఫలకం లేకుండానే శంకుస్థాపన చేశారని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సపావత్ పాండునాయక్ మండిపడ్డాడు. శిలాఫలకం లేకుండా ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన బోర్డును ఆ పార్టీ నాయకులతో కలిసి చూసిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. సాగర్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నోముల భగత్‌ను గెలిపిస్తే గిరిజనుల కోసం బంజారా భవన్ నిర్మించి కానుకగా ఇస్తామని ఎమ్మెల్యే గిరిజనులకు మాటిచ్చారన్నారు. సోమవారం ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందనే విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హడావిడిగా వెళ్లి బంజారా భవన్ నిర్మాణానికి శిలాఫలకం లేకుండా శంకుస్థాపన చేయడం గిరిజనులను మోసం చేయడమేనన్నారు. ఉప ఎన్నికల సమయంలో గిరిజనులకు మాయ మాటలు చెప్పి మభ్య పెట్టి గిరిజన ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. ఇటీవల ఎమ్మెల్యే గిరిజనులను అసభ్య పదజాలం తో దూషిచడం వంటి తీరు గిరిజనులపై సవతి తల్లి ప్రేమ చూపించడం ఎంత వరకు సమంజసమన్నారు. గిరిజనులను మోసం చేసిన వారిని రానున్న ఎన్నికల్లో ఓడించడానికి సిద్దంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నాయకులు మేరావత్ మునినాయక్, సర్దార్‌నాయక్, నాగేందర్‌నాయక్, శివ నాయక్, విజయ్ నాయక్, తలస్యనాయక్, భగ్గునాయక్, రాజేష్‌నాయక్ ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి

త్రిపురారం : తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేస్తూ విద్యాబోధన సాగించాలని కస్తూరిబా గాంధీ సెక్టోరియల్ అధికారి సరిత అన్నారు. బుధవారం మండలంలోని బాబుసాయిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కస్తూరి బా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉన్నతి ప్రోగాంలో భాగంగా విద్యార్థులను సబ్జెక్ట్‌లపై ఉన్న అవగాహనపై విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో పలు రికార్డులను పరిశీలించారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ అధికారి విజయ లక్ష్మీ, ఉపాధ్యాయురాలు నాగలక్ష్మీ, రజిత, వనజా రాణి, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

త్రిపురారం : మండలంలోని నీలాయిగూడెం గ్రామ పంచాయతీకి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు త్రిపురారం మండల పార్టీ అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం హాలియాలోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో మాజీ మంత్రి జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలకు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు వేముల నాగయ్య, కొండ రామచంద్రు యాదవ్, తాళ్ల శంకర్, నేమాని రాంబాబు, వనం శ్రీనివాస్, నల్లమట్టి బక్కయ్య యాదవ్, వంగాల వెంకట్ రెడ్డి, గందం శ్రీను యాదవ్, దామెర లింగయ్య, బుర్రి చిన్న సోమయ్య యాదవ్, వేముల శ్రీను, వేముల మల్లయ్య, వేముల శ్రీనివాస్, గుమ్మ నాగయ్య, చెట్టిపు లక్ష్మారెడ్డి, కుర్ర వెంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులను స్మరించుకుందాం

హాలియా : దేశం కోసం ప్రాణాలర్పించిన అమరు వీరుల స్మరించుకుందామని సాగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పానుగోతు రవినాయక్, బీజేపీ రాష్ట్ర నాయకులు కొంపెల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ కేంద్రంలో మేరీ మాటీ.. మేరా దేశ్ కార్యక్రమాన్ని అసెంబ్లీ కన్వీనర్ చలమల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు ప్రారంభించారు. ముందుగా పట్టణంలోని భక్తాంజనేయ స్వామి, రామాలయం ఆలయాల్లో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఇంటింటా తిరుగుతూ మట్టిని సేకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల, ఇన్‌చార్జ్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'మేరీ మాటి..మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలో నిర్మిస్తున్న అమరవీరుల భారీ స్థూపానికి దేవరకొండ నియోజకవర్గం నుండి మట్టిని తరలిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు తెలిపారు. మంగళవారం దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల్లో గల పుణ్యస్థలాల నుండి సేకరించిన మట్టికి పూజలు నిర్వహించి నల్లగొండకు తరలించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్‌నాయక్, నరసింహారావు, అంజయ్య, సాంబశివ గౌడ్, సైదులు, రమేష్, అంజినాయక్, వినోద్‌రాథోడ్, సుధాకర్ పాల్గొన్నారు.

నేడు ముదిరాజ్‌ల సమావేశం

నల్లగొండ టౌన్ : ముదిరాజ్ సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం బుధవారం స్థానిక చినవెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ముదిరాజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్ల సోమమల్లయ్య తెలిపారు. మంగళవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పందిరి శ్రీనివాస్‌ముదిరాజ్, కావలి ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, దినేష్, తలారి యాదగిరిముదిరాజ్ పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

నల్లగొండ టౌన్ : ఆర్థోపెడిక్ దినోత్సవం సందర్భంగా ఎంవీఎన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 12న గురువారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు దేవరకొండ రోడ్డులోని సత్యవతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచిత ఆర్థోపెడిక్ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు కార్యనిర్వాహక కార్యదర్శి పి.నర్సిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : దేవరకొండ మండలం చింతబావి గ్రామానికి చెందిన పలువురు మంగళవారం దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవీంద్రకుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుండి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే తిరిగి బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మారుపాకుల సురేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్‌గౌడ్, సర్పంచ్ నోముల మల్లేష్, అంజయ్య, బొడ్డుపల్లి కృష్ణ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వీఎస్ఆర్ స్కూల్ కరస్పాండెంట్ వెంకటయ్య

హాలియా : సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13న నల్లగొండలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో స్థానిక వీఎస్ఆర్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ శివర్ల వెంకటయ్య తెలిపారు. పాఠశాలకు చెందిన ప్రీతంకుమార్, చల్ల మేఘన పాల్గొని జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో చక్కటి ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతులు గెలుచుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ శివర్ల వెంకటయ్య, ఉపాధ్యాయులు సాయిరాంరెడ్డి, జానయ్య, సాయికుమార్, నాగయ్య, జ్యోతి, పరమేష్, అశ్విని తదితరులు అభినందించారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న పోస్టల్ అధికారి మదన్‌మోహన్

పెద్దవూర : పేదలకు ప్రభుత్వం కల్పిస్తున్న పోస్టాఫీస్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ అధికారి ఎ. మదన్‌మోహన్ అన్నారు. మంగళవారం జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా మండలంలోని పోతునూరు గ్రామపంచామయతీలో పోస్టాఫీసు సేవలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో తపాలాశాఖ ఆధ్వర్యంలో అనేక సేవలను అందిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సక్రు నాయక్, మెయిల్ ఓవర్సీర్ శ్రీనివాస్, స్థానిక పోస్ట్‌మాస్టర్ అనంతశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్ మధుకు నివాళి



మధు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డ్యాం ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి

నాగార్జునసాగర్ : సాగర్‌డ్యాం సెక్యూరిటీ (ఎస్‌పీఎఫ్) ప్రత్యేకరక్షణ దళంలో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ బుషిపాక మధు మృతదేహంపై డ్యాం ఆర్‌ఐ మధు తోటి ఉద్యోగులు నివాళులర్పించారు. డ్యాం ఆర్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండకు వెళ్లి వస్తుండగా అనుముల మండలం పులిమామిడి వెంకటాపురం స్టేజీ మధ్యలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యి అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. వెంటనే స్థానిక కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దహనసంస్కారాల నిమిత్తం కుటుంబసభ్యులకు ఆర్‌ఐ రూ.20వేలు అందజేశారు. ఇదిలా ఉంటే గడిచిన 10రోజుల్లో ఇద్దరు ఉద్యోగులు మరణించారు. ఈ నెల 2న నాగరాజు గుండెపోటుతో మరణించాడు. సోమవారం రాత్రి మధు మరణించడంతో ప్రత్యేక రక్షణ దళం ఉద్యోగుల కుటుంబాలు దుఃఖసాగరంలో మునిగాయి.

విద్యుదాఘాతంతో ఆవులు మృతి



తిమ్మయ్యపాలెంలో విద్యుదాఘాతానికి మృతి చెందిన ఆవు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : విద్యుదాఘాతంతో వేర్వేరు చోట్ల మూడు ఆవులు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధిత రైతుల వివరాల ప్రకారం.. మండలంలోని తిమ్మయ్యపాలెం గ్రామానికి చెందిన మూడావత్ సోమ్లా తన ఎద్దులను తోలుకొని రోజు వారి లాగానే మంగళవారం కూడా పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో 11 కేవీ విద్యుత్‌వైరు తెగి ఎద్దుపై పడిపోవడంతో విద్యుదాఘాతానికి గురైన ఎద్దు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. రెండు కాడి ఎద్దుల్లో ఒక ఎద్దు మృతి చెండటంతో తన వ్యవసాయ పనులు ఎలా సాగించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎద్దు విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని ప్రభుత్వం తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అలాగే మండలంలోని యల్లాపురం తండాకు చెందిన రమావత్ స్వామి, రమావత్ శ్రీను తన ఆవులను తోలుకొని మేపడానికి పొలానికి వెళ్లగా రమావత్ శ్రీను పొలం వద్ద తెగిపడిన విద్యుత్‌వైరును ఆవులు తాకడంతో రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. రెండు ఆవుల విలువ సుమారు. లక్ష ఉంటుందని ప్రభుత్వం తమ కుటుంబాలను ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

మాడుగులపల్లి టోల్‌ప్లాజా వద్ద విస్తృత తనిఖీలు



మాడుగులపల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మాడుగులపల్లి : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. నగదు, మద్యం, విలువైన ఇతర వస్తువులు వాహనాల్లో తరలించకుండా రహదారులపై చెక్‌పోస్టులు, ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి సోదాలు చేస్తున్నారు. అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై మాడుగులపల్లి శివారులో టోల్‌ప్లాజా వద్ద మంగళవారం పోలీసులు ముమ్మర వాహన తనిఖీలు చేశారు. ప్రైవేట్ వాహనాలు, కార్లు, ఆర్టీసీ బస్సుల్లోని ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరైనా సరైన పత్రాలు లేకుండా రూ. 50 వేలకు మించి తరలిస్తే సీజ్ చేస్తామని ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపారు. కోడ్ ముగిసే వరకు నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని వెల్లడించారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ జాఫర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటుపై హర్షం



సాగర్ ఎడమకాల్వలో కృష్ణమ్మకు హారతి ఇస్తున్న బీజేపీ నాయకులు

వేములపల్లి : తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రా మధ్య కృష్ణా జలాలను పంపిణీకి కేంద్ర ప్రభుత్వం కృష్ణా ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్‌రెడ్డిలు మండల కేంద్రంలోని సాగర్ ఎడమకాల్వలో కిసాన్ మోర్చా చలమల్ల సీతారాంరెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి అనంతరం కృష్ణమ్మకు హారతి ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ నాశనం చేశారన్నారు. కృష్ణా జలాల వాటా కోసం సీఎం కేసీఆర్ ఏనాడూ నోరు మెదపలేదన్నారు. కనీసం అపెక్స్ కౌన్సిల్‌కు కూడా హాజరుకాకపోగా సుప్రీంకోర్టును ఆశ్రయించి సమస్యను మరింత జటిలం చేశారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవ తీసుకోని తెలంగాణ రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి కృష్ణా ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిర్ర సాంబమూర్తి, గుడుగుంట్ల సాయన్న, గుండా నవీన్‌రెడ్డి, పెదమాం వెంకన్న, జవ్వాజి సత్యనారాయణ, సాధినేని శ్రీనివాస్‌రెడ్డి, కొండేటి సరిత, పందిరి భాగ్యమ్మ, శంకర్‌రెడ్డి, భరత్, వెంకట్‌రెడ్డి, జానకిరాంరెడ్డి, అంతయ్య, నాగిరెడ్డి, దశరథ తదితరులు పాల్గొన్నారు.

జెన్‌కో జేపీఏ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉద్యోగులు

నాగార్జునసాగర్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాగార్జునసాగర్ జెన్‌కోలో 2013 జూనియర్ ప్లాంట్ అటెండెంట్ (జేపీఏ) బ్యాచ్ నియామకమై అక్టోబర్ 10 నాటికి 10 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారు నాగార్జునసాగర్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తెలంగాణ జెన్‌కో ఏపీ జెన్‌కోలోని విద్యుదుత్పాదక కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులు, ఇక్కడినుండి బదిలీపై రైట్‌బ్యాంక్, పుట్టంగండి, కేటీపీఎస్, పాలేరులలో ఉద్యోగం చేస్తున్న వారు పైలాన్ జెన్‌కో అతిథిగృహంలో కలిశారు. వీరంతా జెన్‌కో సీఈ మంగేశ్‌నాయక్‌కు పుష్పగుచ్ఛాలు, మెమొంటోలను అందజేశారు. ఉద్యోగం చేస్తున్న చోట కష్ట నష్టాలను ఒకరికొకరు అడిగి తెలుసుకోని ఆలింగనం చేసుకున్నారు.